06-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈ జ్ఞానంలో గంభీరతా గుణాన్ని ధారణ చేయడము ఎంతో అవసరము, ఎప్పుడూ కూడా స్వయము విషయంలో అభిమానము రాకూడదు, మాతల పట్ల గౌరవాన్ని ఉంచండి"

ప్రశ్న:- పిల్లలందరి పట్ల తండ్రికి ఉన్న ఆశ ఏమిటి? ఆ ఆశను ఎప్పుడు పూర్తి చేయగలరు?

జవాబు:- తండ్రి ఆశ ఏమిటంటే - పిల్లలు ఎటువంటి పురుషార్థము చేయాలంటే, దాని ద్వారా నరుని నుండి నారాయణునిగా అయి చూపించాలి. దీని ద్వారానే తండ్రి ప్రత్యక్షత జరుగుతుంది. ఎటువంటి ప్రత్యక్షతను చేయాలంటే, దాని ద్వారా తండ్రి మహిమ జరగాలి, అలాగే పిల్లల మహిమ కూడా జరగాలి. బాబా అంటారు - పిల్లలూ, ఒకవేళ మీరు నరుని నుండి నారాయణునిగా అయినట్లయితే మీ మందిరము కూడా తయారవుతుంది మరియు నా మందిరము కూడా తయారవుతుంది. ఇటువంటి పూజ్యులుగా తయారయ్యేందుకు ఫాలో ఫాదర్ చేయండి. మేము పూర్తిగా ఫాలో చేస్తాము అని మీతో మీరు ప్రతిజ్ఞ చేసుకోండి.

పాట:- ఏ రోజు నుండైతే నీవు, నేను కలుసుకున్నామో... (జిస్ దిన్ సే మిలే హమ్ తుమ్...)

ఓం శాంతి. తప్పకుండా మేము కొత్త ప్రపంచము కొరకు అన్నీ కొత్త విషయాలను వింటున్నాము అని, మా ఈ ప్రీతి కొత్తగా ఏర్పడుతుంది అని పిల్లలు అనుభవం చేస్తారు, వారికి ఆ అనుభూతి కలుగుతుంది. ఇంకెవరికీ పరమపిత పరమాత్మతో సమ్ముఖములో ప్రీతి ఉండదు. మరి ఇది కొత్త విషయము కదా. బాబా పతిత-పావనుడని మీకు తెలుసు. పాత ప్రపంచాన్ని పతితమైనదని, కొత్త ప్రపంచాన్ని పావనమైనదని అంటారు. కావున మీ ప్రీతి కొత్త ప్రపంచముతో జోడించబడుతుంది. ఇప్పుడు మన ప్రీతి కొత్త ప్రపంచమైన స్వర్గముతో ఉందని మీకు తెలుసు. దానిని శివాలయము అని అంటారు, దీనిని వేశ్యాలయము అని అంటారు. తప్పకుండా ఇక్కడ వికారీ మనుష్యులు ఉన్నారు. సత్యయుగములో నిర్వికారులు ఉంటారు, అందుకే దానిని శివాలయము అని అంటారు కదా. శివబాబాయే ఇటువంటి నిర్వికారీ ప్రపంచాన్ని స్థాపన చేస్తారు. ఏ దేవతలైతే కొత్త ప్రపంచములో ఉండేవారో ఆ దేవతల చిత్రాలు ఈ పాత ప్రపంచంలో తప్పకుండా ఉంటాయని మీకు తెలుసు. భారతవాసులంతా మర్చిపోయారు, వారు హిందుస్థాన్ అని అంటారు. మా హిందుస్థాన్ ఎంతో ప్రియమైనది అని అంటారు. అవును, తప్పకుండా ప్రియమైనదే, కానీ నిజానికి హిందుస్థాన్ అన్న పేరు కాదు, దీనిని భారతఖండము అని అంటారు. తప్పకుండా ఇవి కొత్త విషయాలుగా అనిపిస్తాయి అని పిల్లలకు తెలుసు. ఇటువంటి విషయాలను ఎప్పుడూ వినలేదు. ఈ జ్ఞానం మొత్తం ప్రపంచమంతటికీ అతీతమైనది. భారతవాసులకు మందిరాలు కూడా ఎన్నో ఉన్నాయి. క్రిస్టియన్లకు ఒక్క చర్చే ఉంటుంది, వారు తర్వాత వేరు-వేరు చర్చిలను నిర్మిస్తారు. సత్యయుగములో మందిరాలు ఏవీ ఉండవు ఎందుకంటే అక్కడ చైతన్య దేవతల రాజ్యం నడుస్తుంది. దేవతలు శివాలయమైన కొత్త ప్రపంచములో రాజ్యం చేసేవారు. ఇప్పుడు మనం కొత్త ప్రపంచములోకి వెళ్తున్నామని మీకు తెలుసు. బాబా ఈ కొత్త ఇంటిని నిర్మించారు అని కూడా అనుకోకండి. నిజానికి పాత ప్రపంచములో ఇది కూడా పాతదే. మన ప్రీతి ఇప్పుడు కొత్త ప్రపంచముతో జోడించబడింది. ఆత్మలకు సమ్ముఖముగా కూర్చొని ఉన్న పరమాత్మతో ప్రీతి ఏర్పడింది. బ్రహ్మాకుమార-కుమారీలకు బ్రహ్మాతో ప్రీతి ఏర్పడింది అని మనుష్యులు భావిస్తారు. మన ప్రీతి ఒక్క శివబాబాతోనే ఉందని, ఇంకెవ్వరితోనూ లేదని మీకు తెలుసు. మీకు బి.కే. అన్న పేరు ఉన్నా కానీ మీకు బ్రహ్మాపై ప్రీతి లేదు. ఈ బ్రహ్మా దేహధారియే కదా. వీరు జనన-మరణాలలోకి వస్తారు. మీరు దేహముతో సంబంధాన్ని జోడించకూడదు. ఆ గురువులు సచ్చిదానంద అంటూ తమకు పేర్లు పెట్టుకుంటారు. కానీ నిజానికి సత్-చిత్-ఆనంద స్వరూపుడు అని ఒక్క పరమాత్మనే అంటారు. ఆత్మ సత్-చిత్-ఆనంద రూపముగా, శాంత రూపముగా, జ్ఞాన రూపముగా ఉండేది. ఇప్పుడు మీరు మళ్ళీ ఈ సంగమయుగములో అలా తయారవుతారు. ఏ విధముగా తండ్రికి జ్ఞానసాగరుడు, శాంతిసాగరుడు... అన్న మహిమ ఉందో, అలాగే మీరు కూడా సత్-చిత్-ఆనంద స్వరూపులు. బీజాన్ని మరియు వృక్షాన్ని స్మృతి చేయడం ద్వారా మొత్తం జ్ఞానమంతా వచ్చేస్తుంది. తప్పకుండా ఐదు యుగాలు ఉన్నాయి. ఇప్పుడు ఇది సంగమయుగము. ఈ సంగమయుగము గురించి ప్రపంచానికి తెలియదు. ఒకవేళ తెలిసినా కూడా సత్యయుగములో ఎవరు రాజ్యం చేసేవారు, వారు ఎలా రాజ్యం తీసుకున్నారు అన్నది వివరంగా తెలియదు. మీరు ఇప్పుడు రాజ్యాన్ని తీసుకుంటున్నారు. పునర్జన్మలు తీసుకుంటూ చక్రములోకైతే తప్పకుండా రావలసి ఉంటుంది. స్వర్గములో ఎవరూ సదా ఉండలేరు. స్వర్గము మరియు నరకము యొక్క పరిచయము ఇప్పుడే

లభించింది. ఇప్పుడు ఇది కలియుగము, మళ్ళీ సత్యయుగము తప్పకుండా ఉంటుంది. కావున తప్పకుండా సంగమములోనే పరమపిత పరమాత్మ వచ్చి ఉంటారు. వారి మహిమయే వేరు. ఒకరి మహిమ ఇంకొకరికి ఉండదు. ప్రతి ఒక్కరి కర్తవ్యము ఎవరిది వారిదే, సంస్కారాలూ ఎవరివి వారివే. ఒకరివి ఇంకొకరితో కలవవు. ప్రతి ఆత్మలోనూ తమ-తమ పాత్ర ఉంది. ఆత్మ 84 జన్మలు తీసుకుంటుందని పిల్లలైన మీకు అర్థం చేయించడం జరిగింది. మీరు కొత్త విషయాలను వింటారు. భగవానువాచ - నేను రాజయోగాన్ని నేర్పించి మిమ్మల్ని రాజులకే రాజులుగా అనగా నరుని నుండి నారాయణునిగా, నారి నుండి లక్ష్మిగా తయారుచేస్తాను. బాబా అడుగుతారు కూడా - మీరు సూర్యవంశీ నారాయణునిగా అవుతారా లేక చంద్రవంశీ రామునిగా అవుతారా? అప్పుడు ఏమంటారంటే - బాబా, లక్ష్యము-ఉద్దేశ్యము అయితే సూర్యవంశీయులుగా అవ్వాలనే ఉంది. నంబరువారుగా అయితే ఉంటారు కదా. బ్యారిస్టర్లు కొందరు చాలా బాగుంటారు, కొందరు సామాన్యముగా ఉంటారు. కొందరు సర్జన్లు లక్షలాది రూపాయలు సంపాదిస్తారు, కొందరు చాలా కొద్దిగా సంపాదిస్తారు. చదువుపై ఆధారపడి ఉంది. మీలో కూడా కొందరు చాలా సంపాదించేవారిగా అవుతారు, సింహాసనముపై కూర్చుంటారు. ఇది చాలా పెద్ద ఈశ్వరీయ కాలేజి. ఆ కాలేజీలలో హద్దు ఉంటుంది, కొంతమందే పాస్ అవుతారు. ఇది అనంతమైన కాలేజి. కావున మీరు కొత్త విషయాలను వింటారు. అబలలైన మీకు బలాన్ని ఇచ్చేవారు ఆ పరమపిత పరమాత్మయే అని ఇప్పుడు మీరు అర్థం చేసుకుంటున్నారు. పరమాత్మ అయిన తండ్రి ద్వారా మనకు ఎంత బలం లభిస్తుంది అనేది మీకు తెలుసు. మనం యోధులము (సైన్యము), యుద్ధ మైదానములో నిలబడ్డాము. ఇది కొత్త విషయం కదా. గీతలో పాండవులు మరియు కౌరవుల యుద్ధాన్ని చూపించారు కానీ యుద్ధము యొక్క విషయమేమీ లేదు. ప్రతి విషయము కొత్తదే. శ్రీకృష్ణుడు కొత్త ప్రపంచానికి అల్ఫ్ (మొదటివారు). అల్ఫ్ (మొట్టమొదటివారి) నుండి మొదలుకుని అన్నీ కొత్త విషయాలే. లక్ష్మీ-నారాయణులు కొత్త ప్రపంచములోని అల్ఫ్ (మొట్టమొదటివారు), ఆ తర్వాత వారి వెనుక వారి పిల్లలు ఉంటారు. కావున లక్ష్మీ-నారాయణులు సత్యయుగ మనుష్య సృష్టిలోని అల్ఫ్ (ప్రథములు). ఇక్కడ మనుష్య సృష్టి రచయిత అల్ఫ్ (ప్రథముడు) అయిన బ్రహ్మ. మొట్టమొదట పరమపిత పరమాత్మ అల్ఫ్ (ప్రథముడు), ఆ తర్వాత బ్రహ్మను అల్ఫ్ గా (ప్రథమునిగా) తయారుచేస్తారు. ఆ తర్వాత లక్ష్మీ-నారాయణులను అల్ఫ్ గా (ప్రథములుగా) తయారుచేస్తారు. ఇక్కడ మీరు బ్రాహ్మణ కులానికి చెందినవారు. బ్రాహ్మణ కులానికి పెద్దగా బ్రహ్మయే గాయనము చేయబడతారు. వారు కూడా బ్రాహ్మణులే కానీ బ్రహ్మకుమార-కుమారీలు అన్న పేరును ఎప్పుడూ వినలేదు. గీతలో కూడా ఈ పేరు లేదు. కావున ఇది కొత్త విషయం కదా. భారత్ ను హిందుస్థాన్ అని అన్న కారణంగా హిందూ ధర్మం అని అనేస్తారు. తమ ప్రాచీన ధర్మం గురించి పరిచయం లేదు. దేవతా ధర్మం లేనే లేనట్లుగా భావిస్తారు. తమ ధర్మం గురించి తెలియని కారణముగా అన్ని ధర్మాలూ ఒక్కటే అని అంటారు. ఇక్కడ అని ధర్మాలూ ఉండవచ్చు, ఎవరు కావాలనుకుంటే వారు ఉండవచ్చు, అందరికీ అనుమతి ఉంది. అని ధర్మాల వారికీ గౌరవము ఇస్తారు. ఏ ధర్మం వారైనా వచ్చి ఉండవచ్చు. బయటివారిని చూడండి, వారు ఇతర ధర్మాలవారిని బయటకు పంపించేస్తూ ఉంటారు. సిలోన్, బర్మా మొదలైన స్థానాల నుండి భారతీయులను బయటకు పంపించేస్తూ ఉంటారు. నిజానికి భారత్ ప్రాచీన దేవీ-దేవతా ధర్మానికి చెందినది. కానీ వారు ఎవరైనా వచ్చి ఉండవచ్చు అని చెప్తారు. అందరూ కలిసి ఉండలేరు. ఎక్కడికక్కడ ధర్మాల గొడవ ఎంతో ఉంది. భారత్ అన్ని ధర్మాలకూ ఆశ్రయము ఇస్తుంది అని అంటారు. అందుకే భారత్ కు మహిమ ఉంది. ఇప్పుడు మీరు అన్నీ కొత్త విషయాలను వింటారు. ఈ సమయంలో భారత్ లో దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు ఎవరూ లేరు. మనము ఆ కొత్త ప్రపంచము కొరకు పురుషార్థము చేస్తున్నాము. శివబాబా స్వర్గాన్ని రచిస్తారు. నిజానికి అందరూ బ్రహ్మ సంతానమే, కానీ బ్రాహ్మణులు విశేషముగా మహిమ చేయబడతారు. వారిని ఎప్పుడు రచించారు? తప్పకుండా సంగమయుగములోనే రచించారు. వర్ణాలను కూడా బాగా చూపించాలి. బ్రాహ్మణులైన మనము పిలక, ఆ తర్వాత దేవతా, క్షత్రియ, వైశ్య, శూద్రులుగా అవుతాము. కావున ఈ జ్ఞానం చాలా గుహ్యమైనది మరియు రమణీకమైనది. ఇది ఎవరి బుద్ధిలోనైనా కష్టం మీద కూర్చుంటుంది.

పిల్లలైన మీరు ఈ జ్ఞానాన్ని మంచి రీతిలో ధారణ చేయండి, ఎప్పుడూ బ్రాహ్మణిపై అలగకూడదు. ఇలా అలిగి చదువును వదిలేయకూడదు లేదంటే రసాతలములోకి వెళ్ళిపోతారు. తండ్రి వినిపించేందుకు వచ్చారు కావున వినాలి కదా. భక్తి మార్గంలో గీతను వినే నియమం ఎంతగా ఉంటుంది, వారు పూర్తి నియమముతో వింటారు. మందిరాలకు కూడా నియమ పూర్వకముగా వెళ్తారు. రోజు పక్కా నియమము పెట్టుకుంటారు. మీ నియమాలు చాలా కఠినమైనవి. ఒక ఘడియ, అర్ధ ఘడియ... అలా పెంచుతూ ఉండాలి. బాబాను స్మృతి చేయడం ద్వారా బుద్ధి తాళం తెరుచుకుంటుంది. శివబాబా ఏమీ విచార సాగర మంథనము చేయరు, వారికి విచార సాగర మంథనము చేయవలసిన అవసరమే లేదు. ఎవరికైనా ఎలా అర్థం చేయించాలి అని - విచార సాగర మంథనము చేయవలసిన అవసరం మీకు

ఉంటుంది. కావున ఎప్పుడూ అలగకూడదు. ఒకరిపై ఒకరు గౌరవము ఉంచాలి. చాలామంది పిల్లలకు మహారథుల పట్ల గౌరవము ఉంచడం రాదు. బ్రాహ్మణీలు ఎవరైతే ఉన్నారో, వారు ఎంతైనా ముఖ్యులు. 10-12 మందినైనా తమ సమానముగా తయారుచేస్తారు కదా. కావున వారిపై గౌరవము ఉంచవలసి ఉంటుంది. మీరు శివబాబాకు ఏజెంట్ల వంటివారు. ఏజెంట్లు అందరూ ఒకే విధముగా ఉండరు. నంబరువారుగా ఉంటారు, కానీ ఎంతైనా ఏజెంట్లే కదా. కొందరైతే చాలా బాగా ధారణ చేస్తారు. రాత్రింబవళ్ళు సేవలో తత్పరులై ఉంటారు. శివబాబా కూడా ఇక్కడకు సేవ కొరకే వచ్చారు కదా. బాబా అంటారు, నేను రెండు పనులు చేస్తాను. భక్తుల సేవను కూడా చేస్తాను. మొత్తం ప్రపంచమంతటిలోనూ సాక్షాత్కారం చేయించే కర్తవ్యాన్ని ఎవరు చేస్తారు అనేది మీకు తెలుసు. డ్రామాలో అంతా ముందు నుండే రచింపబడి ఉంది, ఆ సమయంలోనే సాక్షాత్కారం జరుగుతుంది. గాడ్ ఫాదర్ దివ్యదృష్టి ద్వారా సాక్షాత్కారం చేయించారు అని భావిస్తారు. ఎక్కడికక్కడ సాక్షాత్కారాలు జరుగుతూ ఉంటాయి. ఈ సాక్షాత్కారాలు కూడా డ్రామాలో రచింపబడి ఉన్నాయి, ఇందులో చాలా విశాలబుద్ధి కావాలి. ఇవి కొత్త విషయాలు. సృష్టి చక్రము బుద్ధిలో తిరగాలి. కొందరిలో ఈ స్వదర్శన చక్రము బాగా తిరుగుతుంది, కొందరిలో తక్కువగా తిరుగుతుంది. మీరు స్వదర్శన చక్రధారులు. సేవ కొరకు బుద్ధి నంబరువారుగా తిరుగుతూ ఉంటుంది. కొందరికైతే స్వదర్శన చక్రము అసలు తిరగనే తిరగదు. గాలి అయితే తగులుతుంది కానీ కొందరిది ఎక్కువగా తిరుగుతుంది, కొందరిది చాలా తక్కువగా తిరుగుతుంది, కొందరిదైతే అసలు తిరగనే తిరగదు. స్వదర్శన చక్రము తిరగకపోతే మరి ఇక ఏ పదవిని పొందుతారు? కావున ఇది కొత్త విషయము కదా. తండ్రి అర్థం చేయిస్తున్నారు - వారసత్వము తీసుకోవాలనుకుంటే ఇప్పుడే తీసుకోండి లేదంటే తర్వాత పశ్చాత్తాపపడతారు, ఏడుస్తారు. టీచర్ ను ప్రత్యక్షం చేయాలి కదా. ఇది ఎంత పెద్ద కాలేజి. బాగా చదువుకున్నట్లయితే పదవిని కూడా బాగా పొందుతారు. మేము పూర్తిగా ఫాలో చేస్తాము అని ప్రతిజ్ఞ చేయాలి. మాత, పితలను ఫాలో చేయాలి. బ్యారిస్టర్ కొడుకు బ్యారిస్టర్ గానే అవుతాడని కూడా కాదు, ఒకరు డాక్టరుగా అవుతారు, ఒకరు ఇంజనీరుగా, ఒకరు అసురునిగా, ఒకరు బందిపోటుగా కూడా అవుతారు. తండ్రి అంటారు, నా ప్రత్యక్షతను చేయడానికి మీరు నరుని నుండి నారాయణునిగా అయి చూపించండి. అప్పుడు నా మహిమ కూడా జరుగుతుంది, అలాగే మీ మహిమ కూడా జరుగుతుంది. మీరు కూడా దేవతలుగా అవుతారు. నా మందిరాలూ తయారవుతాయి, అలాగే మీ మందిరాలు కూడా తయారవుతాయి. ముఖ్యమైన మందిరముగా ఒక్క శివబాబాదే ఉండాలి. ఆ తర్వాత వారితోపాటు బ్రహ్మ మరియు పిల్లలు ఉంటారు. దిల్వాడా మందిరములో వెరైటీ ఉంది కదా. ఇదే అన్నింటికన్నా పెద్ద స్మృతిచిహ్నము. మీరు చైతన్యముగా కూర్చున్నారు. శక్తులు పులిపై స్వారీ చేస్తారు, మహారథులకు ఏనుగుపై స్వారీ చూపిస్తారు. ఏనుగును మొసలి మింగేస్తుంది. తండ్రి స్మృతి లేకపోతే మాయ రూపీ మొసలి తినేస్తుంది. మంచి-మంచి మహారథులను కూడా మాయా మొసలి తినేస్తుంది. ఇందులో చాలా గంభీరత కావాలి, నేను ఇది చేస్తున్నాను అన్న అభిమానము రాకూడదు. ఎంత వీలైతే అంత ప్రతి విషయములోనూ మాతలను ముందుంచాలి. మాతలపై గౌరవము ఉంచాలి. అన్ని తాళంచెవులు మాతల చేతుల్లో ఉండాలి, మాతల ద్వారా సమాచారము రావాలి. కొన్నిచోట్ల కన్యలు మరియు మాతల కన్నా కుమారులు చురుకుగా ఉంటారు. వారు సలహా కోసం బాబాకు వ్రాయాలి. ఆజ్ఞ సర్కారుదైతే రాజ్యం రాణిది. మొదట రాణి, ఆ తర్వాత రాజు. మొదట గురువైన మాత కావాలి. పురుషులు గురువులుగా అయ్యే నియమము లేదు. మాతలను ముందుంచాలి. నియమము ఈ విధంగా చెప్తుంది. అయితే అక్కడక్కడా పురుషులు కూడా మాతలను జ్ఞానంలోకి తీసుకువచ్చేందుకు నిమిత్తులుగా అవుతారు కానీ మెజారిటీ మాతలదే. నాకు అంతా తెలుసు, నేను తెలివైనవాడిని అన్న అహంకారము ఉండకూడదు. మాతలను చురుకైనవారిగా తయారుచేయాలి. మాతల ద్వారా సెంటర్లు మొదలైనవాటిని నడపాలి. అంతిమంలో సన్యాసులు మొదలైనవారికి కూడా మాతల బాణాలే తగులనున్నాయి. కావున నియమానుసారముగా నడుచుకోవాలి. పరమపిత పరమాత్మకు నిందను తీసుకొచ్చేవారు ఉన్నత పదవిని పొందలేరు. బాబా అందరినీ అప్రమత్తం చేస్తారు. చాలా మధురముగా అవ్వాలి. ఎవరైనా చెప్పేది నచ్చకపోతే ఒక చెవితో విని ఇంకొక చెవితో వదిలేయాలి. క్రోధము చాలా నష్టపరుస్తుంది. కామం కన్నా క్రోధాన్ని తీవ్రమైనదిగా ఎందుకు చూపించలేదు అని కొందరు రాస్తారు. కానీ అలా కాదు, కామం అయితే ఆదిమధ్యాంతాలు దుఃఖాన్ని ఇస్తుంది. పతిత-పావనుడు అని ఒక్క తండ్రినే మహిమ చేస్తారు. సన్యాసులు పావనముగా తయారుచేయలేరు. కావున మీరు కొత్త విషయాలను వింటారు. ఉన్నతోన్నతుడైన భగవంతుడు కూర్చొని మిమ్మల్ని చదివిస్తారు. వారినే శ్రీ శ్రీ అని అంటారు. మళ్ళీ మనుష్య సృష్టిలో శ్రీ లక్ష్మి-శ్రీ నారాయణ, శ్రీ రామ-శ్రీ సీత అని అంటారు. అచ్ఛా, వీరిని ఇంత శ్రేష్ఠముగా ఎవరు తయారుచేసారు? శ్రీ శ్రీ అయిన శివబాబా తయారుచేసారు. అచ్ఛా.

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక

పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. పరస్పరం ఐక్యతతో ఉండాలి, ఒకరి పట్ల ఒకరు గౌరవము ఉంచాలి. ఎప్పుడూ అలిగి చదువును వదిలేయకూడదు.

2. క్రోధము చాలా నష్టపరుస్తుంది, అందుకే ఏ విషయమైతే మీకు నచ్చదో దానిని ఒక చెవితో విని ఇంకొక చెవితో వదిలేయాలి. క్రోధము చేయకూడదు, చాలా-చాలా మధురముగా అవ్వాలి.

వరదానము:- బుద్ధి ద్వారా శుద్ధ సంకల్పాల భోజనాన్ని స్వీకరించే సదా స్వచ్ఛమైన హోలీహంస భవ

హోలీహంసలు ఎప్పుడూ బుద్ధి ద్వారా జ్ఞాన ముత్యాలను తప్ప ఇంకేదీ స్వీకరించరు. ఉన్నతమైన పిలక స్థానములో ఉన్న బ్రాహ్మణ ఆత్మలు ఎప్పుడూ క్రింద విషయాలను స్వీకరించరు. హోలీహంసలు అనగా సదా స్వచ్ఛము, సదా పవిత్రము, పవిత్రతయే స్వచ్ఛత. హోలీహంసలు సంకల్పాలు కూడా అశుద్ధమైనవి చేయలేరు. సదా శుద్ధ సంకల్పాలనే భోజనాన్ని భుజించే హోలీహంసలు సదా ఆరోగ్యముగా ఉంటారు. వారిపై ఎవ్వరి ప్రభావమూ పడదు.

స్లోగన్:- మీ మనసా ద్వారా శాంతి కుండాన్ని ప్రత్యక్షము చేసే శాంతిప్రియ ఆత్మలుగా అవ్వండి.